ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

మంగళవారం 10 జూన్ 2025



## మంత్రి పర్యటన సాగిందిలా..

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోమవారం ఉదయం 10:45 గంటలకు పార్వతీపురం చేరుకున్నారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి తదతరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మహిళలు హారతులిచ్చారు. 12 గంటలకు రాయల్ కన్వెన్షన్ హాల్‌లో షైనింగ్ స్టార్స్ పేరిట విద్యార్థులతో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదే సమయంలో ఉపాధ్యాయుల వినతి పత్రం అందుకునేందుకు మంత్రి వచ్చారు. అనంతరం మళ్లీ విద్యార్థులతో సమావేశమై పురస్కారాలు అందించారు. వారితో ముఖాముఖి నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటలకు పార్వతీపురం మండలం చినబొండపల్లిలో టీడీపీ నాయకుల, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. రాత్రి 8 గంటల వరకు అక్కడే ఉన్నారు. ఆ తర్వాత విశాఖపట్నం బయల్దేరి వెళ్లారు.

# సంస్కరణలతో విద్యారంగం బలోపేతం

- రానున్న నాలుగేళ్లలో అద్భుతమైన ఫలితాలు
- షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి లోకేశ్



షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో మంత్రులు లోకేశ్, సంధ్యారాణి, ప్రభుత్వ విప్ జగదీశ్వరి, ఎమ్మెల్యే విజయచంద్ర





హాజరైన మహిళా నేతలు

పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

మంత్రి ప్రసంగాన్ని వింటున్న పార్టీ నేతలు

పార్వతీపురం, జూన్9(ఆంధ్రజ్యోతి): సంస్కరణలతో విద్యారంగాన్ని మరింత బలోపేతం చేస్తామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి , టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు.ప్రైవేటు రంగానికి మించి అద్భుతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. రాబోయే నాలుగేళ్లలో ఉత్తమ ఫలితాలు సాధిస్తామని తెలిపారు. టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను షైనింగ్ స్టార్స్ అవార్డు-2025 పేరిట సత్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం పార్వతీపురంలోని రాయల్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 95 మందికి, ఇంటర్ ఫలితాల్లో మెరిసిన 26 మందికి ఆయన అవార్డులు అందించారు. అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... మెరుగైన ఫలితాలు సాధనకు వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నామన్నారు. టెన్త్ ఫలితాల్లో మన్యం జిల్లా హ్యాట్రిక్ విజయం సాధించిన నేపథ్యంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. టెన్త్ తర్వాత విద్యార్థులకు కొత్త జీవితం ప్రారంభమవుతుంని, ఒకసారు పక్కదారి పడితే భవిష్యత్ నాశనమవుతుందన్నారు. తల్లిదండ్రుల పరిస్థితులను బట్టి నడుచుకోవాలని సూచించారు.

### విభేదాలు సృష్టించేందుకు కుట్ర..

పార్వతీపురం, జూన్9 (ఆంధ్రజ్యోతి): ప్రాంతాలు, కుల, మతాల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రతిపక్షం కుట్ర పన్నుతోందని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్వతీపురం మండలం చినబొండపల్లిలో టీడీపీ నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..' యువగళంలో నాడు అడ్డుకున్న పోలీసులే నేడు సెల్యూట్ చేస్తున్నారు. అదీ ప్రజాతీర్పు. ప్రతిపక్షంలో ఆనాడు చంద్రబాబు చలో ఆత్మకూరుకు పిలుపునిస్తే గేట్లకు తాళ్లు కట్టారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర వంటి నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధించారు. నాపై 23 కేసులు పెట్టారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారు. యువగళం పాదయాత్రతో మైక్, స్టూల్ లాక్కున్నారు. అయినా బిల్డింగ్ పైకి ఎక్కి మాట్లాడా. ఇప్పుడు మనం అధికారంలో ఉన్నా జాగ్రత్తగా వ్యవహరించాలి. అహంకారం, అడ్డగోలు అరెస్టులు, బూతులు వద్దని ప్రజలు వైసీపీని తిరస్కరించారు. అభివృద్ధి, సంక్షేమం కోసం కూటమికి పట్టం కట్టారు. వారి నమ్మకాన్ని మనం నిలబెట్టాలి. జూలై నుంచి గడపగడపకు వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరించాలి. పింఛన్లు, దీపం-2 , గ్యాస్ సబ్సిడీ, తల్లికి వందనం (మిగతా 8వ పేజీలో..)



బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ

## మరో ఏడాదిలో ప్రభుత్వ స్కూళ్లలో సీట్లకు సిఫారసులు

- సమస్యలపై స్పందించే విద్యా శాఖ మంత్రి రావడం అదృష్టం
- షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి అచ్చెన్న
- గిరిజన పాఠశాలలో చదివి ఈ స్థాయికి చేరా: మంత్రి సంధ్యారాణి
- అభివృద్ధిలో వెనుకబడినా.. విద్యలో ముందున్నాం: ఎమ్మెల్యే బోనెల

పార్వతీపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): 'మరో ఏడాదిలో ప్రభుత్వ స్కూళ్లలో సీట్లకు సిఫారసు చేసే పరిస్థితి వస్తుంది. ప్రభుత్వ విద్యను ఇంకా ముందు కెళ్లడానికి కలిసికట్టుగా పనిచేద్దాం.' అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. షైనింగ్‌స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవంలో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... 'ఏపీలో చిట్టచివరి, అత్యంత వెనుకబడిన జిల్లా పార్వతీపురం మన్యం. ఎక్కువగా గిరిజనులు నివసించే ఈ జిల్లాలో షైనింగ్ స్టార్స్ అవార్డుల కార్యక్రమం నిర్వహించినందుకు మంత్రి లోకేశ్‌ను అభినందించాలి. గత పాలకులకు ఇటువంటి కార్యక్రమం నిర్వహించాలన్న ఆలోచన రాలేదు. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో మన్యం జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలుస్తుందని ఎవరూ ఊహించరు. విద్యతోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని గుర్తించి ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేశ్ ఎన్నో సంస్కరణలు తెచ్చారు. కష్టమైన విద్యాశాఖను పట్టుబట్టి తీసుకున్నారు లోకేశ్. గత ప్రభుత్వం ప్రజా సమస్యలపై స్పందించిన దాఖలాలు లేవు. ఎవరినీ సమస్యలను చెప్పుకోనీయలేదు. ఇప్పుడు ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ ఇచ్చారు. గత ఐదేళ్లలో పాలకుల తీరు వల్ల రాష్ట్రం పూర్తిగా దివాలా తీసింది. వ్యవస్థలు కుప్పకూలాయి. అభివృద్ధి కుంటుపడింది. కష్టాలతో ప్రయాణం ప్రారంభించి ముందుకెళ్తున్నాం. సమస్యలపై స్పందించే మంత్రి దొరకడం అదృష్టం. తల్లిదండ్రులు కూడా శ్రద్ధ చూపని విధంగా విద్యార్థులకు మంచి యూనిఫారం డిజైన్ ఇచ్చారు. గత ఐదేళ్లలో దుర్మార్గ ప్రభుత్వం నాడు-నేడు పేరుతో రూ.4500 కోట్లు దుర్వినియోగం చేసింది. భవనాలు పాడు చేశారు. అసంపూర్తిగా వదిలేశారు. డబ్బు ఖర్చుపెట్టి స్కూళ్లు ఎత్తేశారు. అనాచిత నిర్ణయాలతో సమస్యలు వచ్చాయి.' అని తెలిపారు.



లోకేశ్‌తో మంత్రి అచ్చెన్నాయుడు

### గిరిజన స్కూల్‌లోనే చదివి ఈ స్థాయికి చేరా

గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ.. 'విద్యార్థులకు స్ఫూర్తినిస్తున్న మంత్రి లోకేశ్ ఇక్కడకు రావడం మా అదృష్టం. టెన్త్, ఇంటర్మీడియట్‌లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు. లోకేశ్ విద్యారంగంలో పెను మార్పులు తెచ్చారు. గతంలో సీఎం చంద్రబాబు ప్రతి గ్రామానికి స్కూల్, మండలానికో కాలేజ్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. దివంగత నేత ఎన్టీఆర్ కారణంగా గురుకుల విద్యాలయాలు ఏర్పటయ్యాయి. ఆయన వల్లే మా విద్యార్థులు చదువు కొనసాగించగలుగుతున్నారు. అభివృద్ధిలో వెనుకపడ్డ జిల్లాలో (మిగతా 8వ పేజీలో..)

## 'చంద్రబాబు, వాజ్‌పేయి.. నాకు స్ఫూర్తి'

- విద్యార్థులతో ముఖాముఖిలో మంత్రి లోకేశ్



8లో

## అవార్డులతో ఆత్మవిశ్వాసం

- వృత్తి విద్యనూ ప్రోత్సహించడం అభినందనీయం
- విద్యార్థులు, తల్లిదండ్రుల ఆనందం

6లో

## రామతీర్థానికి పాలకవర్గం ఎప్పుడో?

- జాడ లేని అభివృద్ధి
- భక్తులకు అంతంతమాత్రంగా సౌకర్యాలు

నెల్లిమర్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి దేవస్థానం అభివృద్ధి, నిర్వహణపై దిశానిర్దేశం చేయాల్సిన పాలక వర్గం (ట్రస్టు బోర్డు) నియామకంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ కాలయాపన ప్రభావం ఆలయ అభివృద్ధిపై పడుతోంది. తక్షణం చేయాల్సిన పనులు కూడా సాగడం లేదు. భక్తులకు సౌకర్యాలు మెరుగుపడడం లేదు. ఆధునికీకరణ పనులదీ అదే పరిస్థితి. రామతీర్థం దేవస్థానానికి 1998లో తొలి సారిగా ట్రస్టు బోర్డును నియమించారు. వైసీపీ ప్రభుత్వంలో 2022లో పాలక వర్గాన్ని ఏర్పాటుచేశారు. అది 2024 ఫిబ్రవరి వరకు కొనసాగింది. కానీ అభివృద్ధి చర్యలేవీ తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం దేవస్థానానికి ట్రస్టు బోర్డును నియమిస్తే గతం నుంచి పేరుకుపోయిన సమస్యలు పరిష్కారం కావడంతో పాటు నిధులను తెప్పించుకునే బాధ్యతను కూడా సభ్యులు చూసుకుంటారని సర్వత్రా అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టాలన్నా, అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి తీసుకురావాలన్నా, ఆదాయం పెంచేందుకు చేపట్టాల్సిన మార్గాలపై అన్వేషించాలన్నా పాలకవర్గం కీలకం.

రామతీర్థం అభివృద్ధికి సంబంధించి గతంలో పలుమార్లు ఉన్నతాధికారులకు, ప్రధానంగా పర్యాటక శాఖ అధికారులకు ప్రతిపాదనలు వెళ్లినా ఆ ఫైళ్లు బుట్ట దాఖలయ్యాయి. దేవాలయం గత ఆనవాళ్లను యథావిధిగా చూపించాలన్న సదుద్దేశంతో చేపట్టిన శాండ్ బ్లాస్టరింగ్ పనులు పూర్తయినా ఆధునికీకరణ కొలిక్కిరాలేదు. దేవస్థానానికి దక్షిణ భాగాన ఉన్న రామ కోనేరుకు సమీపంలో తాటియాకుల శాలలో కొనసాగించిన కేశ ఖండనశాలను ఎత్తి వేసి దేవస్థానం ఉత్తర భాగాన నిర్మించిన భక్తుల వసతిగృహం సెల్లార్‌లో తాత్కాలికంగా నడుపుతున్నారు. ఇక్కడ ఎలాంటి వసతులు లేక అటు భక్తులతో పాటు ఇటు క్షురకులు అవస్థలు పడుతున్నారు. కాటేజీల్లో ఎలాంటి వసతి సౌకర్యాలు కల్పించలేదు. పాలకవర్గాన్ని నియమిస్తే మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుందన్నది స్థానికులు, భక్తుల మాట.



## రేపు సీతంపేటలో జాబ్‌మేళా

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సీతంపేట వైటీసీలో ఈనెల 11న జాబ్‌మేళా నిర్వహించ నున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ పాసైన గిరిజన నిరుద్యోగులు జాబ్ మేళాకు హాజరు కావొచ్చని పేర్కొన్నారు. మొత్తంగా 12 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంట ర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు అభ్య ర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రిఫరెన్స్ నెంబర్‌తో పాటు ఆధార్‌కార్డు, ఒరిజినల్ విద్యార్హత సర్టి ఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో వైటీసీకి హాజరుకావల్సి ఉంటుందని చెప్పారు. ఇతర వివరాల కోసం ఈ 63012 75511, 79937 95796 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## వరి విత్తనాల కొరత లేకుండా జాగ్రత్తలు

- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

6లో

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి

## టీడబ్ల్యూ ఈఈగా కుమార్

- రేపు బాధ్యతల స్వీకరణ

8లో

## రోడ్డెక్కాలంటే భయం

- పెరుగుతున్న ప్రమాదాలు
- నెత్తురోడుతున్న రహదారులు

6లో

## వదలని ఘీంకరింపు!

- గ్రామాల్లో సంచారం ● మామిడి తోటలు ధ్వంసం



సీతానగరం, జూన్9 (ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలాన్ని గజరాజులు వీడడం లేదు. కొద్దిరోజులుగా ఈ ప్రాంతంలోనే హల్‌చల్ చేస్తూ స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. సోమవారం కోట సీతారాంపురం-పూనుబుచ్చింపేట మధ్యలో సంచరించాయి. ఆయా గ్రామాల్లో మామిడి తోటలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. కాగా రాత్రి వేళల్లో అవి ఏ గ్రామంలోకి వస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మరోవైపు ట్రాకర్లు, అటవీశాఖ సిబ్బంది ఏనుగులను పర్యవేక్షిస్తున్నారు. ఒంటరిగా ఎవరూ బయటకు వెళ్లరాదని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గజరాజులను చూసి కవ్వింపు చర్యలకు పాల్పడరాదని హెచ్చరిస్తున్నారు.

## పి-4తో అసమానతల తొలగింపు

- హోం శాఖ మంత్రి మంత్రి అనిత

6లో

# ఇప్పటికి గట్టెక్కుదామనీ

- జూన్ మాసంలో పెరిగిన ఖర్చులు
- అప్పుల బాట పట్టిన సామాన్యులు
- పిల్లల చదువు, సాగు, వైద్యంపై తప్పని వ్యయం
- బ్యాంకుల్లో బంగారం కుదువపెట్టి రుణాలు



పాలకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి)

జూన్ వచ్చిందంటే చాలా మందికి హడలే. అందులోనూ రైతులు, పేదల సంగతి వేరే చెప్పనక్కర్లేదు. అప్పు చేయందే ఈ నెల గడవడం వారికి కష్టం. రైతులు భూములను తనఖా పెడుతున్నారు. చిరుద్యోగులు, వ్యాపారులు ఇంట్లో ఉన్న బంగారం కుదువపెట్టి రు ణం పొందుతు న్నారు. ఏమీ లేనివారు ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల వద్ద అధిక వడ్డీకి రుణం తీసుకుంటున్నారు. ఈఎంఐ రూపంలో చెల్లించేందుకు సిద్ధపడుతున్నారు. మే చివరి వారం నుంచి ఇలా బంగారం కుదు వపెట్టి రుణాలు తీసుకున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందని బ్యాంకువర్గాలు చెబుతున్నాయి. ఏ బ్యాంకు చూసినా రుణాలు తీసుకున్న వారితో కిటకిటలాడుతున్నాయి.

### తెరుచుకోనున్న పాఠశాలలు..

విద్యాసంవత్సరం ప్రారంభానికి (మిగతా 8వ పేజీలో..)

- వర్షాలు పడడంతో పాలకొండ మండలానికి చెందిన కె.రామినాయుడు అనే రైతు వరి నారుమడి తయారు చేసుకునే పనిలో పడ్డాడు. సాగు పెట్టు బడి కోసం ఇటీవల బ్యాంకులో బంగారం కుదువ పెట్టాడు. గంపెడాశతో ఖరీఫ్ పనులు ఆరంభించాడు. పంట బాగా పండితే జనవరిలో అప్పు తీర్చేయవచ్చునని భావిస్తున్నాడు.
- పార్వతీపురానికి చెందిన బి.ప్రకాశరావు అనే ప్రైవేటు ఉద్యోగి తన ఇద్దరు పిల్లలను కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తున్నాడు. జూన్ మాసం కావడంతో ఫీజులు, ఇతర ఖర్చుల కోసం లక్ష రూపాయలు అవసరమయ్యాయి. ఇందుకోసం భార్య బంగారు ఆభరణాలను కుదువపెట్టి రుణం తీసుకున్నాడు.
- భామినికి చెందిన సాంబమూర్తి ఇటీవల వడ్డీ వ్యాపారుల వద్ద కొంత డబ్బు రుణంగా తీసుకున్నాడు. ఇంట్లో అందరూ వరుసగా జ్వరాల బారిన పడడంతో ఆస్పత్రి ఖర్చు కోసం అప్పు తీసుకున్నాడు. రక్త పరీక్షలు, వైద్యం, మందుల కోసం రూ.20 వేల వరకూ ఖర్చు అయ్యింది. పిల్లల చదువుకు కూడా డబ్బులు అవసరం కావడంతో మరింత అప్పు చేశాడు.

# అవార్డులతో ఆత్మవిశ్వాసం

● వృత్తి విద్యనూ ప్రోత్సహించడం అభినందనీయం ● విద్యార్థులు, తల్లిదండ్రుల ఆనందం



అవార్డు అందిస్తున్న మంత్రి నారా లోకేష్

పార్వతీపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): 'ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు ప్రదానం చేయడం చాలా మంచి ఆలోచన. దీని వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది' అని అవార్డులు అందుకున్న విద్యార్థులు అభిప్రాయపడ్డారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డులు అందుకోవడం పట్ల పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

### ఇది చాలా మంచి ఆలోచన..



పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారిని సత్కరించాలనేది చాలా మంచి ఆలోచన. విద్యాశాఖ మంత్రి నార లోకేష్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్‌అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఎంతో అదృష్టం ఉంటే తప్పితే ఇక్కడకు రాలేం. లోకేష్‌తో వ్యక్తిగతంగా మాట్లాడాలని ఉంది. షైనింగ్ స్టార్స్ అవార్డులు ఇవ్వడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. వంద రోజుల యాక్షన్ ప్లాన్ వల్ల విద్యార్థుల్లో భయం పోయి..ఆత్మవిశ్వాసం పెరిగింది. దీనివల్ల పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవడానికి అవకాశం కలిగింది. ఐఏఎస్ కావాలన్నది నా లక్ష్యం.

-సాయి భువనకృతి వకుదావత్, పదో తరగతి విద్యార్థిని

### అవార్డు స్ఫూర్తినిస్తోంది



విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్స్ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. ఇది స్ఫూర్తి కలిగిస్తోంది. పేదరికానికి, చదువుకు సంబంధం లేదని షైనింగ్ స్టార్స్ అవార్డు రుజువు చేసింది. ఇలాంటి అవార్డులు ఇచ్చినందుకు ధన్యవాదాలు. భవిష్యత్తులో సీఎస్ఈ గ్రూప్ తీసుకొని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలన్నది నా లక్ష్యం.

-కరణం రోహిత్ కుమార్, ఇంటర్ విద్యార్థి

### వృత్తివిద్యకు ప్రాధాన్యమివ్వడం బాగుంది



నేను సాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓఎ వృత్తి కోర్సు చదివాను. జనరల్ గ్రూప్స్ వారితో పాటు ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకూ ప్రాధాన్యం ఇచ్చినందుకు సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు. ఇంటర్‌లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వల్ల చదువుపై దృష్టి సారించే వీలు కలిగింది. దీనితో పాటు పుస్తకాలు, నాణ్యమైన బ్యాగ్ అందించారు. దీనితో బాగా చదవడానికి, ఉత్తీర్ణత పొందడానికి ఎక్కువ అవకాశాలు కలిగాయి. నన్ను ప్రతిభా అవార్డుకు ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు. భవిష్యత్తులో బ్యాంకు ఆఫీసర్ కావాలనేది నా కల.

-సింగ్ బంగారుతల్లి, ఇంటర్ విద్యార్థిని

### ఆనందంగా ఉంది



నా కుమారుడు దీక్షిత్ సాయి షైనింగ్ స్టార్స్ అవార్డు అందుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది. మా కుమారుడికి దృష్టి లోపం ఉంది. స్క్రైబ్ సాయంతో ఇంటర్ పరీక్షలు రాశాడు. మంచి మార్కులు సాధించాడు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పార్వతీపురం వచ్చి వెన్నుదన్నుగా నిలవడం ఆనందంగా ఉంది. ఇంకా బాగా చదవడానికి ఈ అవార్డు ప్రోత్సాహాన్నిస్తోంది.

-వసంతల శ్రీనివాసరావు, ఇంటర్ విద్యార్థి తండ్రి

### ఉన్నత చదువులకు సాయం చేయాలి



మా పాప తనూజకు ఇలాంటి అవార్డు వస్తుందని అనుకోలేదు. లోకేష్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది. నా భర్త మెకానిక్. నేను గృహిణిని. మా పాప ఉన్నత చదువులకు కూడా ఆర్థికసాయం చేయాలని కోరుతున్నాను.

-అలుపూరి సంతోషి, పదో తరగతి విద్యార్థిని తల్లి



మంత్రి అచ్చెన్నాయుడుతో టీడీపీ నేతలు

# వరి విత్తనాల కొరత లేకుండా జాగ్రత్తలు

● వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

రామభద్రపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో వరి విత్తనాల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన కొద్దిసేపు విలేకరులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే ముందస్తుగా అన్ని జిల్లాలక లక్ష్యాలు తీసుకొని విత్తనాలు కేటాయించామన్నారు. అలాగే రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందులో భాగంగా రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. చాలా జిల్లాలకు డ్రోన్లు కూడా కేటాయించామని చెప్పారు. వీటి ద్వారా రైతులు సులభంగా ఎరువులు, పురుగు మందులు చల్లుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ నెలలోనే అన్నదాతా సుఖీభవ కింద రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. టీడీపీ నాయకుడు చింతల రామకృష్ణ, వసంతుల సన్యాసినాయుడు, చింతల చినమ్మతల్లి, కనిమెరక వెంకటి తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

● ఎస్పీ వకుల్ జిందాల్




ఫిర్యాదుదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో బాధితుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా 41 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో భూ తగాదాలకు సంబంధించి 13, కుటుంబ కలహాలకు సంబంధించి 9, మోసాలకు పాల్పడినట్టు 5, ఇతర అంశాలకు సంబంధించి 14 ఫిర్యాదులు ఉన్నాయని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదు అంశాలను... వాటి పూర్వాపరాలను పరిశీలించి.. వాస్తవమైతే తక్షణం స్పందించాలన్నారు. వీటిపై విచారణ చేపట్టి.. తీసుకున్న చర్యలను ఏడు రోజుల్లో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, ఎస్‌బీ సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కే చౌదరి, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.




యోగాసనాలు వేస్తున్న గౌరినాయుడు

# యోగాలో లింగాలవలస యువకుడి ప్రతిభ

రేగిడి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6 నుంచి 8వ వరకు కోల్‌కత్తాలో నిర్వహించిన ఆల్ ఇండియా యోగా కల్చరల్ పోటీల్లో రేగిడి మండలం పెద్దలింగాలవలసకు చెందిన రెడ్డి గౌరినాయుడు రెండు విభాగాల్లో ప్రతిభ చూపాడు. 35వ నేషనల్ ట్రెడిషినల్ యోగా స్పాన్ చాంపి యన్‌షిప్ -2025ను కైవసం చేసుకున్నట్టు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. పురుషుల 30 నుంచి 40 ఏళ్ల విభాగంలో నిర్వహించిన రెథమిక్ యోగాసన పోటీల్లో బంగారు, ట్రెడిషినల్ యోగాసనాల్లో కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా గౌరినాయుడును గ్రామస్తులు అభినందించారు.



బంగారు పతకం అందుకుంటున్న గౌరినాయుడు

# పి-4తో అసమానతల తొలగింపు

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత

● విజన్ డాక్యుమెంట్ యూనిట్ ప్రారంభం



జిల్లా యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అనిత

విజయనగరం కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అసమానతలను తొలగించేందుకు పి4 విధానం ఒక మార్గమని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు సుమారు 20 లక్షల మంది మార్గదర్శకులను గుర్తించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ జిల్లా యూనిట్‌ను సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో మంత్రి ప్రారంభించారు. సీపీవో కార్యాలయం వద్ద ఈ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. దీనిని ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతి నుంచి నిర్వహించిన వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వికసిత్ భారత్‌కు అనుగుణంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ సాధించేందుకు అన్ని నియోజకవర్గాల్లో యూనిట్ కార్యాలయాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇప్పటికే ప్రతి జిల్లాలోనూ జిల్లా, నియోజకవర్గ, మండల, సచివాలయ స్థాయిలో విజన్ డాక్యుమెంట్లు రూపొందించామని చెప్పారు. రానున్న ఐదేళ్లలో సాధించే అభివృద్ధితో పాటు 2047 నాటికి సాధించాల్సిన ప్రగతిని ఈ డాక్యుమెంట్లలో పొందుపరిచినట్టు మంత్రి తెలిపారు. ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచడం... ఉద్యోగాలు ఇవ్వడం... మౌలిక సదుపాయాలు కల్పించడం తదితర అంశాలు ప్రణాళికలో ఉన్నాయని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి ఐదుగురు సభ్యుల బృందాన్ని దీని కోసం నియమించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, సీపీవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

### హోం మంత్రిని కలిసిన ఎస్పీ..

విజయనగరం క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం జిల్లా పరిషత్ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను హోం మంత్రి అనితకు ఎస్పీ వివరించారు.

# రోడ్డెక్కాలంటే భయం

జాతీయ రహదారిపై కారును ఢీకొన్న లారీ (ఫైల్)



● పెరుగుతున్న ప్రమాదాలు

● నెత్తురోడుతున్న రహదారులు

● మితిమీరిన వేగం.. నిర్లక్ష్యంగా డ్రైవింగ్

● మృతుల్లో యువకులే అధికం

రాజాం రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి)

ప్రమాదం... చదవడానికి మూడక్షరాల చిన్న పదమే. కానీ జీవితాలను తారుమారు చేసి... మనిషి మనుగడనే ప్రశ్నార్థకం చేసే భయంకర పదమిది. రోడ్డు ప్రమాదాలు ఎన్నో కుటుంబాలను... ఎన్నో జీవితాలను తలకిందులు చేస్తున్నాయి. జిల్లాలో అధికశాతం రోడ్డు ప్రమాదాలు డ్రైవర్ల నిర్లక్ష్యం... నిబంధనలు పాటించకపోవడం... మద్యం మత్తు వంటి కారణాల వల్ల సంభవిస్తున్నాయి. వాహనం నడిపే వ్యక్తి తన కుటుంబాన్ని... తనపై ఆధారపడిన వారిని... ఒకవేళ తనవల్ల ప్రమాదం సంభవిస్తే ఎదుటి వాహనంలో ప్రయాణించే వారికి కలిగే కష్టనష్టాల గురించి ఆలోచిస్తే అతివేగం తగ్గుతుంది. నిర్లక్ష్యం వీడుతుంది. అప్రమత్తత పెరుగుతుంది. ప్రయాణం సుఖాంతమవుతుంది. కానీ.. వాహనాల డ్రైవర్లకు ఇవేవీ పట్టడం లేదు. మితిమీరిన వేగం ఎన్నో కుటుంబాలలో చీకట్లను మిగుల్చుతోంది.

### ● మద్యం, సెల్‌ఫోన్ మాటలు వద్దు..

వాహనం నడిపే సమయంలో మద్యం తాగడం అత్యంత ప్రమాదకరం. ఇటీవల కాలంలో సెల్‌ఫోన్ చూస్తూ డ్రైవింగ్ చేయడం అలవాటుగా మారింది. ఇలా చేయడం వల్ల ఎదురుగా.. వెనుక నుంచి వచ్చే వాహనాలను గమనించలేని పరిస్థితి. ప్రస్తుత రోజుల్లో ఈ తరహా ప్రమాదాలే ఎక్కువగా జరుగుతున్నాయి. నిద్రమత్తులో ఉన్నపుడు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాన్ని నడపకూడదు. ఎంత అత్యవసరమైనా అది మనకు.. మన కుటుంబానికంటే ఎక్కువ కాదన్న విషయాన్ని గుర్తెరగాలి. మనతో పాటు ఎదుటి వారి ప్రాణాలను రక్షించే చర్యలు కూడా మన చేతుల్లోనే ఉన్నాయి. నిర్ణీత వేగం వల్ల కాస్త ఆలస్యం కావచ్చునేమో గానీ క్షేమంగా గమ్యస్థానానికి చేరుతామన్న విషయాన్ని డ్రైవర్లు తెలుసుకోవాలి.

### ● డ్రైవర్లు సుశిక్షితులై ఉంటే..

రోడ్డు ప్రమాదాల నివారణ బాధ్యత ప్రధానంగా డ్రైవర్లపైనే ఉంది. డ్రైవర్ సుశిక్షితుడై ఉంటూ బాధ్యతాయుతంగా ముందుకు సాగాలి. తాను నడుపుతున్న వాహనానికి సంబంధించిన సాంకేతిక అంశాలపైన, డ్రైవింగ్ నిబంధనలపైన స్పష్టమైన అవగాహన ఉండాలి. రద్దీగా ఉండే సమయంలో వ్యవహరించాల్సిన తీరు, రోడ్ల అంచులు, డివైడర్లను ఎలా అధిగమించాలో స్పష్టమైన అవగాహన డ్రైవర్‌కు ఉంటే ప్రమాదాలు తగ్గుముఖం పడతాయి.

### ● హెల్మెట్ వాడండి..

హెల్మెట్ వినియోగంపై ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చట్టాలు చేసినా, జరిమానాలు విధించినా.. ప్రమాదాల తీరు, రోడ్డున పడుతున్న కుటుంబాలలో నెలకొంటున్న పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపిస్తూ ప్రచారం చేస్తున్నా... అంతగా ఎవరూ పట్టించుకోవడం లేదన్నది వాస్తవం. ఏ కొద్దిమంది ద్విచక్ర వాహనదారులో హెల్మెట్ తలకు ధరిస్తున్నారు. హెల్మెట్ తీసుకువెళ్తున్న వారిలో సగం మంది పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకే తప్ప రక్షణగా తలపై ఉంచడం లేదు. వాహనం వెనుక, పెట్రోల్ ట్యాంకు మీద అలంకారంగా ఉంచుతున్నారు. ప్రమాద సమయంలో చాలా మంది విగతజీవులుగా మారుతున్నారు.

### ● యజమానులదీ కీలక బాధ్యతే..

వాహనాల యజమానులు బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారా అనేక ప్రమాదాలను నియంత్రించవచ్చును. మద్యం మహమ్మారికి బానిసలైన వ్యక్తులను డ్రైవర్లుగా నియమించకూడదు. విధి నిర్వహణకు సంబంధించి కఠిన వైఖరి అవలంబించకూడదు. డ్రైవర్‌కు విశ్రాంతి ఇవ్వడం... తగినన్ని సెలవులు ఇవ్వడం అవసరం. వారి సంక్షేమాన్ని పట్టించుకోవడం ద్వారా డ్రైవర్లు ప్రశాంతంగా విధులు నిర్వహించేందుకు అవకాశం కల్పించాలి.



ప్రమాదంలో గాయపడిన యువకులు (ఫైల్)

### ఇవిగో సంఘటనలు..

● మే నెల 21న తెర్లాంలో ఆటో బోల్తా పడిన ప్రమాదంలో గరివిడి మండలం కోడూరుకు చెందిన రామకృష్ణ మృతి చెందాడు. ● 17న బొండపల్లి మండలం బోడసింగిపేట వద్ద లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ● 16న ఎల్.కోట మండలం తుమ్మికాపల్లి వద్ద లారీ ఢీకొన్న ప్రమాదంలో ఏడేళ్ల చిన్నారి లేఖన్ మృతి చెందాడు. ● 11న బొండపల్లి వద్ద లారీ ఢీకొన్న ప్రమాదంలో మక్కువకు చెందిన తుమరాడ జానకిరాం అక్కడికక్కడే అశువులు బాశాడు. అదే రోజు ఎల్.కోట మండలం దేవాడ వద్ద బైక్ ఢీకొన్న ప్రమాదంలో గాడి తాత ప్రాణాలు కోల్పోయాడు. ● ఏప్రిల్ 28న గజపతినగరం నాలుగు రోడ్ల కూడలిలో జరిగిన ప్రమాదంలో అనంతగిరి మండలం మూలవలసకు చెందిన లక్ష్మణరావు మృతి చెందాడు. ● అదేనెల 27న దత్తిరాజేరు మండలం మరడాం వద్ద కారు, వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో కారు డ్రైవర్ సురేష్ మృతి చెందాడు. ● గతనెల 24న రాజాం పట్టణ పరిధిలోని ఫైర్‌స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటన లో బొబ్బిలికి చెందిన పిట్లా రమేష్ మృతి చెందాడు. అదేరోజు సీతానగరం మండలం లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీ సమీపంలో వెనుక నుంచి టాటా మేజిక్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న పట్నాయకుని శ్రీదేవి మృతి చెందారు.



తరచూ బోల్తా పడుతున్న ఆటోలు

### మైనర్లకు వాహనాలివ్వకూడదు..



మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదు. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. మైనర్లు ప్రమాదాలు చేస్తే తండ్రిపై కూడా కేసు నమోదు చేస్తారన్న విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలి. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ వాడాలి. హెల్మెట్ వాడకాన్ని చట్టబద్ధం చేసినా వాహన చోదకుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు.

-కె.అశోక్‌కుమార్, రాజాం టౌన్ సి.ఐ.

### ● పెరుగుతున్న ఆటో ప్రమాదాలు..

జిల్లాలో జరుగుతున్న ప్రమాదాలలో అధికశాతం ఆటోల కారణంగానే అని గణాంకాలు చెబుతున్నాయి. మితిమీరిన ప్రయాణికులతో ముందుకు సాగుతూ... ప్రమాదాల బారిన పడుతూ కుటుంబాలలో తీరని నష్టాన్ని, కష్టాలను మిగులుస్తునాయి. రోజురోజుకూ ఆటోల సంఖ్య పెరుగుతూ వస్తోంది. వీటి డ్రైవర్ల నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు కారణంగా చెప్పవచ్చును. డ్రైవర్ ఇరువైపులా ఇద్దరు ప్రయాణికులను పెట్టుకుని డ్రైవింగ్ చేయడం వల్ల స్టీరింగ్‌పై పట్టుకోల్పోయి ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నాడు. వీటి నియంత్రణలో పోలీసులు చేతులెత్తేశారంటే అతిశయోక్తి కాదు. నిబంధనలకు విరుద్ధంగా.. వెళ్లకూడని ప్రదేశాల్లోకి వెళ్లడం వల్ల కూడా ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి.

**గత మూడేళ్లలో ద్విచక్ర వాహనాల ప్రమాదాలు ఇలా...**

| సంవత్సరం | ప్రమాదాలు | మృతులు | గాయపడిన వారు |
|---|---|---|---|
| 2022 | 69 | 25 | 76 |
| 2023 | 74 | 29 | 69 |
| 2024 | 78 | 32 | 65 |
| 2025 (మే 10 వరకు) | 26 | 16 | 28 |

# విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు

**జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత చేతుల మీదుగా ప్రదానం**

జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులను ప్రదానం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి రూ.20 వేలు, మెడల్, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కలెక్టర్ అంబేడ్కర్ ఉన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం


పూసపాటిరేగ: అవార్డులు అందుకున్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు


హోం మంత్రి అనిత నుంచి అవార్డు అందుకుంటున్న జామి హైస్కూల్ విద్యార్థిని


లక్కవరపుకోట: జమ్మాదేవిపేట జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థిని


బొండపల్లి: శ్రీగాయత్రి టెక్నో స్కూల్ విద్యార్థి


రేగిడి: ఉంగరాడ గురుకులం విద్యార్థి సాయిచరణ్


రాజాం: ఎస్ఎస్ఎస్ కళాశాల విద్యార్థిని శ్రావణి

## నేడు ఐదువేల మందితో యోగాంధ్ర

శృంగవరపుకోట రూరల్, జూన్9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లి సత్యసాయి ఆశ్రమం సమీపంలో ఐదువేల మందితో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సతీష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు కార్యక్రమాన్ని చేపడతామన్నారు. రాష్ట్ర మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని పేర్కొన్నారు.

## బడి బయట దివ్యాంగ పిల్లల గుర్తింపు

శృంగవరపుకోట, జూన్9 (ఆంధ్రజ్యోతి): మండలంలో బడిబయట దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వే సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో దివ్యాంగులకు సమకూరుస్తున్న సదుపాయాలను ఎంఈవోలు నర్సింగరావు, గణపతి లక్ష్మి తల్లిదండ్రులకు వివరించారు. ప్రతి సోమవారం ఫిజియోథెరపీ సేవలపై అవగాహన కల్పించారు.

## ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి

విజయనగరం కలెక్టరేట్, మే9 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేశారు. ఆందోళనలో సీఐటీయూ నాయకులు సురేష్, టీవీ రమణ, వి.లక్ష్మి, సూర్యనారాయణ, సుధారాణి, ముత్యాలు, పెంటరాజు తదితరులు ఉన్నారు.

## మతిభ్రమించి మాట్లాడుతున్నారు..

కొత్తవలస, జూన్9 (ఆంధ్రజ్యోతి): సాక్షి చానల్ డిబేట్‌లో పాల్గొనే జర్నలిస్టులు, వైసీపీ నాయకులు మతి భ్రమించి మాట్లాడుతున్నారని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గం బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పారావు అన్నారు. సోమవారం ఆయన కొత్తవలసలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జర్నలిస్టు ముసుగులో అమరావతి రాజధాని మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించాల్సి పోయి ఆ పార్టీ నాయకులు మద్దతు పలకడం విచారకరమన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలు చేయడం మరీ దారుణంగా ఉన్నాయని వాటిని ఖండిస్తున్నామన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయండి

విజయనగరం దాసన్నపేట, జూన్9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాము, సీహెచ్ వెంకటేశ్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులతో సత్కరించిందన్నారు. అయితే వారిలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల కంటే ప్రైవేట్ విద్యార్థులే అధికంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 580 మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపిక చేయడకపోవడం బాధాకరమన్నారు.

## లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యేలు



లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, లలితకుమారి

రాజాం/శృంగవరపుకోట/చీపురుపల్లి, జూన్9 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు సోమవారం విచ్చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను విశాఖ విమానాశ్రయంలో ఎమ్మెల్యేలు కోండ్రు మురళీమోహన్, కోళ్ల లలితకుమారి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన్ని సత్కరించారు.


లోకేశ్‌తో మాట్లాడుతున్న రామ్‌మల్లిక్ నాయుడు

## స్వర్ణాంధ్ర విజన్ కార్యాలయం ప్రారంభం

విజయనగరం రూరల్, జూన్9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్వర్ణాంధ్ర విజన్-2047 కార్యాలయాన్ని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రారంభించారు. అదే కార్యాలయం నుంచి సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్‌లో విజయనగరం డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, ఎంపీడీవో గంటా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే అదితి

## సమష్టిగా కృషి చేద్దాం

నెల్లిమర్ల, జూన్9 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రూపొందించిన స్వర్ణాంధ్ర విజన్-2047 సాధనకు సమష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విజన్ -2047 నియోజకవర్గ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో కలిసి ఆమె పాల్గొన్నారు. విజన్ లక్ష్యాలను అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి డి.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో రామకృష్ణరాజు, తహసీల్దార్ బి.సుదర్శనరావు, జనసేన పార్టీ నాయకులు చనమల్లు వెంకటరమణ, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కరుమజ్జి గోవిందరావు, అప్పికొండ రవికుమార్, రవ్వా నాని, పతివాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


అధికారులు, నాయకులతో ఎమ్మెల్యే నాగమాధవి

## పేదరిక నిర్మూలనకు చంద్రబాబు కృషి

రాజాం, జూన్9 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్ మానిటరింగ్ యూనిట్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఆశయ్య, ఎంపీడీవో శ్రీనివాసరావు. కమిషనర్ రామప్పలనాయుడు, తహసీల్దార్ రాజశేఖర్ పాల్గొన్నారు.

●చీపురుపల్లి, జూన్9 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా సోమవారం ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు యాక్షన్ ప్లాన్‌ను ప్రారంభించారని ఎంపీడీవో త్రినాథ్ తెలిపారు. సీఎం చంద్రబాబుతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారన్నారు.

## పీజీఆర్ఎస్‌కు 153 వినతులు

విజయనగరం కలెక్టరేట్, మే9 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వివిధ సమస్యలపై 153 వినతులు అందాయి. కార్యక్రమానికి జేసీ సేతు మాధవన్ హాజరయ్యారు. ఆయనతో పాటు జడ్పీ సీఈవో సత్యనారాయణ, డీపీవో వెంకటేశ్వర రావు, సివిల్ సప్లైస్ డీఎం శాంతి వినతులను స్వీకరించారు.


వినతులను స్వీకరిస్తున్న జేసీ

## అనుచిత వ్యాఖ్యలపై భగ్గుమన్న మహిళలు

నెల్లిమర్ల, జూన్9 (ఆంధ్రజ్యోతి): సాక్షి టీవీలో నిర్వహించిన డిబేట్‌లో జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు మహిళలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడంపై నెల్లిమర్లలో మహిళలు భగ్గుమన్నారు. సోమవారం టీడీపీ జిల్లా మహిళా కార్యదర్శి లెంక హైమావతి విలేకరులతో మాట్లాడారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులను, ప్రసారం చేసిన మీడియా సంస్థపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆమెతో పాటు నగర పంచాయితీ మహిళా అధ్యక్షురాలు రెడ్డి సంతోషి, నియోజకవర్గ మహిళా కార్యదర్శి చందక గౌరి, నాయకురాలు అల్తి పద్మ తదితరులున్నారు.


నిరసన తెలుపుతున్న తెలుగు మహిళలు

## క్రిమినల్ కేసులు నమోదు చేయండి

జామి, జూన్9 (ఆంధ్రజ్యోతి): సాక్షి టీవీలో అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సోమవారం జామి పోలీస్‌స్టేషన్‌లో మహిళలు ఫిర్యాదు చేశారు. మహిళలను అవమానించిన వారిని బహిరంగంగా శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఏఎస్ఐ నర్సింగరావుకు ఫిర్యాదు అందజేశారు.


ఫిర్యాదు చేస్తున్న మహిళలు

## ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు

గుర్ల, జూన్9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెట్టంగి సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రవికిఎంపీడీవో శేషుబాబు సోమవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం నేపథ్యంలో నోటీసు అందజేశారు.

## రెండు కార్లు ఢీ: ముగ్గురికి గాయాలు

దత్తిరాజేరు, జూన్9 (ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. మండలంలోని కోమటిపల్లి చెరువు సమీపంలో బొబ్బిలి నుంచి విజయనగరం వైపు వెళుతున్న కారు విజయనగరం నుంచి బొబ్బిలి వస్తున్న మరో కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో పువ్వల శాంతమ్మ, ఆగూరు సంతోషి, పువ్వల రవిబాబులకు గాయాలయ్యాయి. వారిని 108లో ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పెదమానాపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

## కల్యాణ వేంకటేశ్వరుడికి తులాభారం

జామి, జూన్9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమసింగిలో నిర్వహిస్తున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## 'ఉపాధి' కల్పించండి

గుర్ల, జూన్9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోశాడకు చెందిన ఉపాధి వేతనదారులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామంలో 200 మంది వేతనదారులు సమావేశమయ్యారు. తమకు పని కల్పించాలని వినతిపత్రాన్ని ఫ్యాక్స్ ద్వారా అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారులు పరిష్కరించుకోవాలి గానీ వేతనదారులను అవస్థలకు గురి చేయడం తగదని వారన్నారు.

## విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

బొబ్బిలి, జూన్9 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఏపీఐఐసీ గ్రోత్ సెంటర్‌లోని బెర్రీ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమకు చెందిన వెల్డింగ్ కార్మికుడు మహ్మద్ డిల్దార్ అన్సారీ (25) సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. జార్ఖండ్‌లోని ధన్‌బాద్ జిల్లా కలిమండి సమితి అలీమెహిల్లా గ్రామానికి చెందిన రుస్తుం అన్సారీ కుమారుడు డిల్దార్ అన్సారీ ఇక్కడి పరిశ్రమలో వెల్డింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం విద్యుదాఘాతానికి గురికావడంతో స్థానిక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఎస్ఐ రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇదే పరిశ్రమలో అన్సారీ సోదరుడు పనిచేస్తున్నాడు. పోలీసులు ఆయన నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించి కేసు నమోదు చేశారు.

## ఆధార్ కార్డు జెరాక్స్ కోసం వచ్చి..

**●గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ దుర్మరణం**


లక్ష్మి (ఫైల్)

బొబ్బిలి, జూన్9 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి తారకరామా కాలనీ సమీపంలో బొబ్బిలి-పార్వతీపురం రహదారిలో సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొని సాలా లక్ష్మి (58) దుర్మరణం పాలైంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లాలోని బలిజిపేట మండలంలోగల అరసాడ గ్రామానికి చెందిన లక్ష్మి బొబ్బిలిలో తన తమ్ముడు రైల్వే హెచ్‌సీ కమలాకర్ నివాసంలో ఇంట్లో ఉంటోంది. ఆధార్ కార్డు జిరాక్స్‌లు తీయించేందుకు ఇంటి నుంచి పట్టణంలోకి నడుచుకుని వెళ్తోంది. ఆ సమయంలో పార్వతీపురం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం లక్ష్మిని ఢీకొంది. దీంతో ఆమె దూరంగా తుళ్లిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ కటకం సతీష్‌కుమార్, ఎస్ఐ రమేష్‌లు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీ కెమెరాలను పరిశీలించి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మికి ఇద్దరు అన్నదమ్ములు చంద్రశేఖర్, కమలాకర్, ఇద్దరు కుమార్తెలు యమున, గాయత్రి ఉన్నారు. కమలాకర్‌కు తన కుమార్తెను ఇచ్చి వివాహం చేసింది. లక్ష్మి మృతితో బంధువులు రోదిస్తున్నారు.

## చికిత్స పొందుతూ మహిళ..

రామభద్రపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పరాజుపేటకు చెందిన ఓ మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ వెలమల ప్రసాదరావు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బెవర సింహాచలం (65) కడుపు నొప్పి తాళలేక ఆదివారం గడ్డి మందు తాగింది. దీంతో వెంటనే బంధువులు ఆమెను బాడంగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి జరిమానా

రామభద్రపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రామభద్రపురం పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో డ్రంకెన్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన వివిధ ప్రాంతాలకు చెందిన నలుగురికి సాలూరు కోర్టు న్యాయాధికారి హర్షవర్ధన్ ఒక్కక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా సోమవారం విధించారని ఎస్ఐ ప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. వాహన తనిఖీల్లో గరివిడి, కాకినాడ, కోరపు కృష్ణాపురం, గడసాం గ్రామాలకు చెందిన నలుగురు డ్రంకెన్ డ్రైవ్ చేస్తూ పట్టుబడ్డారన్నారు. వారిపై కేసు నమోదు చేసి సోమవారం సాలూరు కోర్టులో ప్రవేశపెట్టామని తెలిపారు.

## భవనం తొలగించారని ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

పూసపాటిరేగ, జూన్9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొవ్వాడ అగ్రహారం పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 201, 202లో 2.20 ఎకరాలలో శ్మశానవాటికలో భవనాన్ని తొలగించారని గ్రామస్థులు సోమవారం తహసీల్దార్ గోవింద్, ఎంపీడీవో రాధికలకు ఫిర్యాదు చేశారు. స్థానిక సర్పంచ్ కోట్ల రఘు దౌర్జన్యంగా తొలగించారని తెలిపారు. దీనిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ కోట్ల రఘు, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌ను వివరణ కోరగా పంచాయతీ తీర్మానం మేరకే శ్మశానవాటికలో చిన్న భవనాన్ని పడగొట్టామన్నారు. దాన్ని ఎవ్వరూ ఆక్రమించలేదన్నారు. బోరు, బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. మూడునెలల కిందట కూల్చామని వారు తెలిపారు.

## బావి పూడ్చివేతపై చర్యలు తీసుకోండి


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

చీపురుపల్లి, జూన్9 (ఆంధ్రజ్యోతి): గ్రామ కంఠంలోని బావిని పూడ్చిన రెల్లి వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలని మండలంలోని పీకే పాలవలస గ్రామస్థులు సోమవారం మండల అధికారులకు ఫిర్యాదు చేశారు. చీపురుపల్లి తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందజేశారు. 80 ఏళ్లుగా వాడుకలో ఉన్న బావిని ఎటువంటి అనుమతులు లేకుండా వెంకటేశ్వర్లు ఆక్రమించుకున్నారని వివరించారు. అలాగే పంచాయతీ కాలువపై ప్రహరీని నిర్మించి సదరు వ్యక్తి వివాదాలకు కారణమవుతున్నారన్నారు. గతంలో పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇటీవల మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో సదరు వ్యక్తిని నిలదీయగా దాడికి పాల్పడ్డారన్నారు. దానిపై చీపురుపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రౌతు కామనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీరాములు నాయుడు, పార్టీ నాయకులు గడి సన్యాసి అప్పలనాయుడు, అంబళ్ల చిన్న తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో మానసికోల్లాసం


రాజాంలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

రాజాం, జూన్9 (ఆంధ్రజ్యోతి): రాజాం, జూన్9 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ఉల్లాసం కలుగుతుందని గురువు టీటీవీ రమణమూర్తి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో యోగాంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఆసనాలు వేశారు. కార్యక్రమంలో కమిషనర్ జె.రామప్పలనాయుడు, ఎంపీడీవో శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్యకుమార్, బీజేపీ నాయకులు కోటగిరి నారాయణరావు, గుడివాడ నాగరాజు పాల్గొన్నారు.


చీపురుపల్లిలో మానవహారం

●అలాగే పట్టణంలో సోమవారం యోగాంధ్ర భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బొబ్బిలి సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. అనంతరం బొబ్బిలి సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ జె.రామప్పలనాయుడు, ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

●రేగిడి: మండల కేంద్రంలో సోమవారం యోగాంధ్రపై ఖండ్యాం, సంకిలి ఆయుర్వేద ఆసుపత్రుల ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్యామలకుమారి, ఇన్‌చార్జి తహసీల్దారు ఈశ్వరరావు, ఎంఈవో వరప్రసాదరావు పాల్గొన్నారు.

●గుర్ల: యోగాంధ్రలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఎంపీడీవో శేషుబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి పొట్నూరు సన్యాసినాయుడు, జడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంఈవో భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

●చీపురుపల్లి: యోగాంధ్రలో భాగంగా సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ నిర్వహించిన అనంతరం అక్కడే మానవహారం నిర్వహించారు. ర్యాలీలో ఎంపీడీవో ఎల్.త్రినాథ్ పాల్గొన్నారు.

●బొండపల్లి: యోగాంధ్రలో భాగంగా మండల కేంద్రంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.గిరిబాల, తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ ఎ.రఘుపతిరావు, ఏవో కె.తులసీనాథ్, డాక్టర్ బి.సునీత పాల్గొన్నారు.

●శృంగవరపుకోట: ఎస్.కోటలోని ఆర్టీసీ డిపోలో సోమవారం మేనేజర్ రమేశ్ ఆధ్వర్యంలో సిబ్బందితో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా శిక్షకుడు కోటేశ్వరరావు యోగాసనాలు వేయించారు.

●నెల్లిమర్ల: యోగాతో ఆరోగ్యం సిద్ధిస్తుందని మండల ప్రత్యేక అధికారి, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ జి.మురళీమోహన్ అన్నారు. మండలంలోని సతివాడలో సోమవారం నిర్వహించిన యోగాంధ్ర ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రామకృష్ణరాజు తదితరులున్నారు.

●వేపాడ: వేపాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారంఅంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వల్లంపూడి సచివాలయం నుంచి వేపాడ సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

●మెరకముడిదాం: మండలంలో సోమవారం యోగాంధ్ర అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఎంపీడీవో జి.భాస్కరరావు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమైంది. కార్యక్రమంలో తహసీల్దార్ అజురఫీ జాన్, ఏవో సుధాకర్ పట్నాయక్, పాల్గొన్నారు.

# షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం

వీరఘట్టం, జూన్ 9 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ ప్రతిభా పురస్కారాలను పార్వతీపురంలో మంత్రి లోకేశ్ ప్రదానం చేశారు. వీరఘట్టం కేజీబీవీ పాఠశాలకు చెందిన గంట్యాడ నందిని, నీలానగరం ఉన్నత పాఠశాల విద్యార్థులు ధర్మాన గ్రీష్మ, కోమటి యువరాజు, గంగంపేట జీటీడబ్ల్యూఏహెచ్ స్కూల్‌కు చెందిన హారిక స్టీఫెన్‌పాల్‌లకు అవార్డులు అందుకున్నారు.

● కురుపాం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన మర్రాపు రిషిత, పొన్నడ ఈశ్వర ప్రసాద్, మీసాల శరణ్యలకు షైనింగ్ స్టార్ అవార్డును మంత్రి లోకేష్ అందజేసినట్లు హెచ్ఎం టి.శంకరరావు తెలిపారు. ఆదర్శ పాఠశాల విద్యార్థి పావని పాణిగ్రాహి అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ రామలక్ష్మి తెలిపారు.

● గుమ్మలక్ష్మీపురం, జూన్ 9 (ఆంధ్ర జ్యోతి): గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన పైడా హర్షిత్‌కు మంత్రి లోకేష్ పార్వతీపురంలో అవార్డు, రూ.20 వేలు నగదు, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.






అవార్డులు అందుకుంటున్న కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మర్రాపు రషిత, పొన్నడ ఈశ్వర ప్రసాద్(కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాల), మీసాల శరణ్య (కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాల), కురుపాం ఆదర్శ పాఠశాల విద్యార్థి పావని పాణిగ్రాహి



లోకేశ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వీరఘట్టం కేజీబీవీ పాఠశాల విద్యార్థిని నందిని

## పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయాలి

● పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు.సోమవారం పార్వతీపురంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళంలోని పాలిటెక్నిక్ కళాశాలకు అధిక సంఖ్యలో పాలకొండ నియోజకవర్గం నుంచి విద్యార్థులు వెళ్తున్నారని తెలిపారు. మంత్రి స్పందిస్తూ కళాశాల మంజూరు కోసం చర్యలు తీసుకుంటానని హామీఇచ్చారు.

### ఆర్ఐలుగా పదోన్నతి కల్పించాలి

అర్హులైనగ్రేడ్-1 వీఆర్వోలకు ఆర్ఐలుగా పదోన్నతి కల్పించాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘంనాయకులు మరడ సింహాచలం, బంకి రాజా, శివ్వాం శ్రీనివాసరావు, వంజరాపు రమేష్‌కుమార్ కోరారు.ఈ మేరకు పార్వతీపురంలో మంత్రి నారా లోకేష్‌కు వినతిప త్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రేడ్-1 వీఆర్వోలు 8,200 మంది 17ఏళ్లగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం క్లస్టర్ విధానం వల్ల రెండు సచివాలయాలకు ఒక వీఆర్వో పనిచేయస్తున్నాని, సచివాలయానికి ఒక వీఆర్‌వోగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### లోకేష్‌ను కలిసిన బీజేపీ నాయకులు

పార్వతీపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో మంత్రి నారా లోకేష్‌ను బీజేపీ జిల్లాఅధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులుకలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గ సమస్యలపై ప్రస్తావించినట్లు సమాచారం.

### జంఝావతి రిజర్వాయర్ పూర్తిచేయాలి

మంత్రి నారా లోకేష్ నిర్వహించిన సమావేశంలో పలువురు కార్యకర్తలు మాట్లాడారు. సీతానగరం టీడీపీ మండలలాధ్యక్షుడు వేణు మాట్లాడుతూ నియోజకవర్గంలో 30 శాతం మాత్రమే పార్టీ ఉండేదని, గత ఎన్నికల తర్వాత పార్టీకి ఎమ్మెల్యే విజయచంద్ర సారధ్యంలో పూర్వ వైభవం వచ్చిందన్నారు.టీడీపీ అరకుపార్లమెంట్ ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకటనాయుడు మాట్లాడుతూఎంతోకాలంగా పార్టీలో ఉంటున్నానని, తమ వంటి నాయకులకు గుర్తించి తగిన పదవిని ఇవ్వాలని కోరారు. జంఝావతి రిజర్వాయర్ పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీడీపీ నాయకులు బద్రినారాయణ మాట్లాడుతూ జంఝావతి ప్రాజెక్టుకు తన కుటుంబం ఎన్నో త్యాగాలు చేసిందన్నారు. బలిజిపేట టీడీపీ మండలాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ తన సోదరుడు క్యాన్సర్‌తో బాధపడుతున్నారని, పార్టీ నుంచి తమకు సహాయంచేయాలని కోరారు.

### ముందస్తుగా బాలయ్య జన్మదిన వేడుకలు

పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ జన్మదినం మంగళవారం పురస్కరించుకుని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ముందస్తు జన్మదిన వేడుకలు నిర్వహించారు.చినబొండపల్లిలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అనంతరం ఎమ్మెల్యే విజయచంద్ర నేతృత్వంలో లోకేష్ కేక్‌కట్ చేశారు.కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు, బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

### టీడీపీలో వైసీపీ కౌన్సిలర్ చేరిక

పార్వతీపురం పురపాలక సంఘానికి చెందిన 28 వార్డు కౌన్సిలర్ మజ్జి శశిధర్ (చంటి) టీడీపీలో చేరారు. మంత్రి నారా లోకేష్ పర్యాటన సందర్భంగా జరిగిన కార్యకర్తల సమావేశంలో లోకేష్‌ను శశిధర్ కలిసి పార్టీలో చేరారు. అలాగే గరుగుబిల్లి ఎంపీపీ ఉరిటి రామరావు తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు.

## పెట్టుబడి సాయం విడుదల చేయాలి

పాలకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రైతు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం ప్రభుత్వం తక్షణమే అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిమిడి రామ్మూర్తినాయుడతో కలిసి కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు.

## పీజీఆర్ఎస్‌కు 23 వినతులు

సీతంపేట రూరల్,జూన్ 9(ఆంధ్రజ్యోతి):స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఏపీవో జి.చిన్నబాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 23వినతులు వచ్చాయి. .కార్యక్రమంలో డీడీ అన్నదొర, టీడబ్ల్యూ ఈఈ పి.రమాదేవి, ఏటీ డబ్ల్యూవో మంగవేణి పాల్గొన్నారు.

## సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

పార్వతీపురం టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీ రింగ్ వర్కర్లు తమకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సోమవారం సమ్మెలోకి దిగారు. సోమవారం మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల యూనియన్ పిలుపు మేరకు స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 15 సంవత్సరాలు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలని, టెక్నికల్ వర్కర్లకు 29,200లు, నాన్ టెక్నిక్ వర్కర్లకు రూ. 24,500లు ఇవ్వాలని కోరారు.

## ఫోర్జరీ సంతకాలపై నిలదీత

జియ్యమ్మవలస, జూన్ 9(ఆంధ్రజ్యోతి):అధికారముందని నిబంధనలు పాటిం చరా అని మండల పరిషత్ అధ్యక్షుడు బొంగు సురేష్‌ను వైస్ ఎంపీపీ గుడివాడ సంపత్‌కుమార్, వైసీపీ ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించారు. సభ్యుల సంతకాలు ఫోర్జరీ చేస్తున్నారని నిలదీశారు.సోమవారం ఎంపీపీ సురేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశంలో ఫోర్జరీ సంతకాలపై వాడివేడిగా చర్చ జరిగింది. తొలుత సభ్యుల సంతకాలను తీసుకుంటున్న సమయంలో కన్నపుదొరవలస ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి రవికుమార్ తన సంతకం గత సర్వసభ్య సమావేశంలో ఫోర్జరీ చేశా రని, తాను రాకుండానే సంతకం ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ఈవిషయంపై వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్, శిఖబడి సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ సమావేశం జరుగుతున్న ప్రతిసారి తగురీతిలో జరగడం లేదని వాకౌట్ చేసి వెళ్లిపోతుంటే సం తకాలు రిజిస్టర్‌లో ఎలా కనిపిస్తున్నాయని, ఎవరు ఇలాఫోర్జరీ సంతకాలు చేస్తు న్నారని ఎంపీపీ సురేష్‌ను నిలదీశారు.

## టీడబ్ల్యూ ఈఈగా కుమార్

సీతంపేట రూరల్,జూన్ 9(ఆంధ్రజ్యో తి): సీతంపేట గిరిజనసంక్షేమ ఇంజనీరిం గ్ ఈఈగా కేవీఎస్ఎన్ కుమార్‌ను నియ మిస్తు సోమవారం ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.ఇప్పటివరకు సీతంపేట ఈఈగా విధులు నిర్వహిస్తున్న పి.రమా దేవిని నెల్లూరు ఐటీడీఏకు బదిలీ చేశారు. విజయవాడలోని గిరిజనసంక్షేమ ఇంజనీ రింగ్‌శాఖ ప్రధానకార్యాలయంలో డీసీఈగా పనిచేస్తున్న కేవీఎస్ఎన్ కుమార్‌ను సీతం పేట ఐటీడీఏలోని గిరిజనసంక్షేమ ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్‌గా నియమిస్తు ఆదేశాలొ చ్చాయి. టీడబ్ల్యూ ఈఈగా కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

## సీడీపీవోగా సిమ్మాలమ్మ

సీతంపేట రూరల్,జూన్ 9(ఆంధ్రజ్యో తి): సీతంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీ పీవోగా టి.సిమ్మాలమ్మ బదిలీపై రాను న్నారు. ఇప్పటి వరకు సీడీపీవోగా పని చేసిన రంగలక్ష్మి భామిని సీడీపీవోగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో పాల కొండ సీడీపీవోగా పనిచేస్తున్న సిమ్మా లమ్మను సీతంపేట సీడీపీవోగా ఐసీడీ ఎస్ పీడీ నియమించారు.

# చంద్రబాబు, వాజ్‌పేయ్.. నాకు స్ఫూర్తి

**విద్యార్థులతో ముఖాముఖిలో మంత్రి లోకేశ్**

పార్వతీపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి):

ఎన్టీఆర్, చంద్రబాబు లాంటి దిగ్గజ నేతల కుటుంబంలో జన్మించడం తన అదృష్టమని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. పార్వతీపురంలోని షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు వేసిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

**ప్రశ్న:** ' మీకు రాజకీయాల్లో స్ఫూర్తినిచ్చింది ఎవరు? (రిషిత, కురుపాం జడ్పీ హైస్కూల్)

జ: నిత్యం రాష్ట్రం కోసం పరితపించే సీఎం చంద్రబాబు, మాజీ ప్రధాని వాజ్‌పేయ్ నుంచి స్ఫూర్తిపొందాను. అంతర్జాతీయంగా అయితే సింగపూర్ మాజీ ప్రధాని లిక్వాండో తనకు స్ఫూర్తి. ఆయన మత్స్యకార గ్రామాన్ని ప్రపంచంలోనే ఫైనాన్షియల్ పవర్ హౌస్‌గా తీర్చిదిదారు.

**ప్రశ్న:** పాఠశాలల్లో లైబ్రరీ వంటి మౌలిక సదుపాయాలు అవసరం.

జ: గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి లైబ్రరీలపై దృష్టిపెడుతున్నాం. రీజనల్ లైబ్రేరీలు ఏర్పాటు చేస్తున్నాం. అమరావతిలో వరల్డ్ క్లాస్ లైబ్రరీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

**ప్రశ్న:** 'మీ ఫేవరేట్ టీచర్ ఎవరు?(పార్వతీపురం కేజీబీవీ విద్యార్థిని జాహ్నవి)

జ: ఇంజనీరింగ్‌లో ప్రొఫెసర్ రాజిరెడ్డి నా ఫేవరేట్. నేను చిన్నప్పుడు అల్లరి చేసినా ఎప్పుడూ లక్ష్మణరేఖ దాటలేదు. పేరెంట్, టీచర్ మీటింగ్ పెట్టినప్పుడల్లా అమ్మతో దెబ్బలు తినేవాడిని.

**ప్రశ్న:** షైనింగ్ స్టార్స్ లాంటి అవార్డులు మీకేమైనా వచ్చాయా?( గుమ్మలక్ష్మీపురానికి చెందిన లంకా హారిక)

జ:నేను చిన్నప్పుడు బ్యాక్ బెంచి విద్యార్థిని. అయితే అనుకున్నది సాధించాలన్న పట్టుదల నాలో ఉండేది. నేను చదివిన స్టాన్‌ఫోర్డ్‌కు అనేక దేశాల నుంచి విద్యార్థులు వచ్చేవారు. వారిజీవన విధానాలన్నీ తెలుసుకున్నా.'

**ప్రశ్న:** నా తల్లిదండ్రులు(పెద్దదిమిలి జడ్పీహెచ్ స్కూల్ దివ్యాంగ విద్యార్థిని కుసుమ) రోజువారీ కూలీలు. నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలని అనుకుంటున్నా.

జ: మీ విజయాన్ని చూసి నేను గర్వపడుతున్నా. ధైర్యంగా ముందుకు సాగండి.. మీ వెంట మేముంటాం.

**ప్రశ్న:** జీవితంలో మీరు కష్టమైన పరిస్థితులను ఎదుర్కొన్నారా, ఆ సమయంలో ఎవరు అండగా నిలిచారు( సాలూరు భాష్యం హైస్కూల్ విద్యార్థిని హరికీర్తన)

జ: చదువుకొనే రోజుల్లో ఆశించిన మార్కులు రానప్పుడు.. యూనివర్శిటీ సీటు రానప్పుడు బాధపడ్డా. ఐదేళ్ల హెరిటేజ్‌లో పనిచేసి ఆ సంస్థను అభివృద్ధి చేశా. ఓటమి నాకు పాఠాలు నేర్పింది. జీవితంలో మీకు కూడా అనేక పరీక్షలు రాబోతున్నాయి. ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలి.

**ప్రశ్న:** డీఎస్సీ పరీక్షకు సమయం ఇస్తే బాగుండేది



మాట్లాడుతున్న లోకేశ్

జ: ఇప్పటివరకు డీఎస్సీకి ఏడు నెలల సమయం ఇచ్చాం. 'డీఎస్సీ ప్రకటించాక 23 కేసులు వేశారు. విద్యా శాఖ మంత్రిగా రాజకీయాలు మాట్లాడను. ఇక్కడ కూడా నా ఫొటోలు పెట్టవద్దని చెప్పాను. ఎలాగైనా నోటిఫికేషన్ ఆపాలని చూశారు. కావాలని కొంతమంది స్వార్థపరులు అడ్డుకోవాలని చూశారు.

ప్రశ్న: గతంలో మాలాంటి ప్రతిభ ఉన్న విద్యార్థులకు రూ.50 వేలు, ల్యాప్‌టాప్ ఇచ్చేవారు. 2019 తర్వాత వాటిని ఇవ్వడం లేదు. మాకు ఆర్థికసాయం అందించాలి(కె.అభిరామ్)

జ: ఉన్నత విద్యా సంస్థల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు గతంలో మాదిరిగా నగదు ప్రోత్సాహకం, ల్యాప్‌టాప్‌లను ఇప్పటినుంచే అందిస్తాం

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయకజగదీశ్వరి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవోకార్యాలయం నుంచి ఎల్విన్‌పేట జంక్షన్ వరకు యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈసంద ర్భంగా జగ దీశ్వరి మాట్లాడుతూ యోగా వల్ల మనిషి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ఏకాగ్రత, రోగనిరోధ కశక్తి పెరుగు తాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకు లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

●వీరఘట్టం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి):యోగాను దినచర్య లో భాగంగా మలుచుకోవాలని ఎంపీడీవో బి.వెంకటరమణ తెలిపారు. వీరఘట్టంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆనందరావు, పంచాయతీ ఈవో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

●గరుగుబిల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యని ఎంపీడీవో జి.పైడితల్లి, మండల విస్తరణాధికారి ఎల్.గోపాల రావు తెలిపారు.గరుగుబిల్లిలో వెలుగు, ఉపాధి, వైద్యసిబ్బందితో యోగాం ధ్రలోభాగంగా ర్యాలీ,మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో మం డల హోమియో వైద్యాధికారి కాసులవర్మ, వెలుగుఏపీఎం పి.అప్పల నాయుడు, గృహనిర్మాణశాఖ సిబ్బంది వి.అఖిల్, భాస్కరరావు, వెలుగు సీసీలు తిరుపతిరావు, బి.రామినాయుడు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

●సీతంపేట రూరల్,జూన్ 9(ఆంధ్రజ్యోతి):యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండల ప్రత్యేకాధికారి జి.చిన్నబాబు తెలిపారు. సీతంపేటలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బీబీ మిశ్రో, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.




గుమ్మలక్ష్మీపురం: యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న జగదీశ్వరి

## ఇప్పటికి గట్టెక్కుదా'మనీ'

(ఐదో పేజీ తరువాయి)

మరికొద్ది రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఈ నెల 12న పాఠశాలలు తెరుచుకోనున్నాయి. పిల్లలు పాఠశాలల్లో చేరిక, వారి ఫీజులు, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు ఒకటేమిటి అన్ని ఖర్చులు కలిసి తడిసిమోపెడే. అందుకే సామాన్య, మధ్యతరగతి ప్రజల్లో జూన్ వస్తే ఒకటే ఆందోళన. ప్రభుత్వం తల్లికి వందనం కింద అందించే రూ.15 వేల కోసం తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూస్తున్నారు. చిన్నపాటి ప్రైవేటు పాఠశాలల్లో ప్రాథమిక తరగతులకు రూ.10 వేలు కంటే ఎక్కువగానే ఫీజులు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకటో తరగతి నుంచి 3వ తరగతి వరకూ గ్రామీణ ప్రాంతాల్లో రూ.6 వేలు, మండల కేంద్రాల్లో రూ.7,500, పట్టణాల్లో రూ.8,500గా నిర్ధారించారు. 4-5 తరగతులకు గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.9 వేలు, పట్టణాల్లో రూ.10,500, జిల్లా కేంద్రంలో రూ.12 వేలు, ఆరో తరగతికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.9 వేలు, మండల కేంద్రాల్లో రూ.9,500, జిల్లా కేంద్రాల్లో రూ.11,100లను ఫీజులుగా నిర్ధారించారు. కానీ పక్కాగా అమలుకావడం లేదన్న విమర్శలున్నాయి.

**సాగుభారమే..**

రుతుపవనాల ప్రభావంతో వర్షాలు పడ్డాయి. దీంతో రైతులు సాగు పనులు ప్రారంభించారు. వరి ఆకుమడులు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం దుక్కులు చేపట్టారు. కాగా రైతుకు గతం కంటే సాగుభారం పెరిగింది. సాగులో యాంత్రీకరణ వచ్చిన తరువాత పెట్టుబడులు కూడా పెరిగాయి. ఏటే ట్రాక్టర్ల దుక్కి అద్దెలు పెరుగుతున్నాయి. కూలీల వేతనం కూడా పెరుగుతోంది. దీంతో ఖరీఫ్ ప్రారంభం నుంచే పెట్టుబడులు అధికంగా ఉన్న దృష్ట్యా భారీగా నగదు అవసరం పడుతోంది. యంత్రాలు, పరికరాలకు ఎనలేని డిమాండ్ ఉండడంతో ఏడాదికేడాది అద్దెలు పెంచుకుపోతున్నారు. వ్యవసాయ కూలీల ధరలు కూడా పెరిగాయి. గతంలో ఎకరా వరి పొలం దమ్ముకు, ఉబాలుకు గుత్త రూపంలో ఇచ్చేవారు. ఇప్పుడు రేట్లు భారీగా పెంచేశారు. కాగా ప్రభుత్వం ఈ నెలలో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో ప్రోత్సాహకం జమచేయనుంది. వాటి కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

**పెరిగిన ఆస్పత్రి ఖర్చు..**

జోరువానలతో వ్యాధులు ముసురుకుంటున్నాయి. ఈ ఏడాది కూడా జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. దీంతో అనివార్యంగా వైద్యఖర్చులు పెరిగాయి. ఏ ఆస్పత్రి చూసినా రోగులతో కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. సామాన్యులు ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్నా సిబ్బంది నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేదు. వైద్య పరీక్షలు అంతంతమాత్రంగా జరుగుతున్నాయి. జ్వరం వస్తే వైద్యులు రక్త పరీక్షలకు సిఫారసు చేస్తున్నారు. సరైన పరికరాలు లేకపోవడం, కొన్నిరకాల పరీక్షలు చేయకపోవడం, ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడం వంటి కారణాలతో కొందరు ప్రైవేటు ల్యాబ్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. సొంత డబ్బులు ఖర్చుపెట్టాల్సి వస్తోంది. ఆస్పత్రుల్లో ఎక్స్‌రే, స్కానింగ్ విభాగాలు సరిగా పనిచేయడం లేదు. వెరసి పేదలు మెరుగైన వైద్యం కోసం డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంటోంది.

## దరఖాస్తులు పునరావృతం కారాదు

పార్వతీపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే దరఖాస్తులు పునరావృతం కాకూడదని డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, ఈసెక్షన్ సూపరింటెండెంట్ జి.శ్రీరామూమూర్తితో కలిసి 44 ఫిర్యాదులను స్వీకరించారు.

## సర్వే వేగవంతం చేయాలి

సీతంపేట రూరల్,జూన్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న డీఏ జుగ సర్వే వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి జి.చిన్నబాబు ఆదేశించారు. సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలోపంచాయతీకార్యదర్శులతో సమావేశంనిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జుగ సర్వేలో ప్రతి ఒక్కరి వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు సమావేశంలో ఎంపీడీవో బీబీ మిశ్రో, డిప్యూటీ ఎంపీడీవో బి రామకృష్ణ డీపీవో సతీష్,కార్యదర్శులు పాల్గొన్నారు.

## మరో ఏడాదిలో ప్రభుత్వ స్కూళ్లలో సీట్లకు సిఫారసులు

(ఐదో పేజీ తరువాయి)

మా విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. ఎనిమిది గిరిజన మండలాల్లో ఫోన్ సిగ్నల్స్ సరిగా రావడం లేదు. ఇంటర్నెట్ సమస్య లేకుండా చూడాలని కోరుతున్నా. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో కడుపు నింపిన ఘనత లోకేశ్‌దే. జోగింపేట స్కూల్‌లో ఇద్దరు ఐఐటీ , ముగ్గురు ఎన్ఐటీ సీట్లు సాధించారు. చదువుకుని ఏదైనా సాధించాలన్న పట్టుదల మా విద్యార్థులకు ఉంది. ప్రోత్సాహం ఇస్తే వారు ఉన్నత స్థానానికి చేరుతారు. నేను గిరిజన స్కూల్‌లో చదువుకొని ఈ స్థాయికి వచ్చా. ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లు తక్కువగా ఉన్నాయి. నియోజకవర్గానికి ఒక బాలికల జూనియర్ కాలేజ్ ఇవ్వాలి.' అని కోరారు.



**మంచి ఫలితాలు సాధించాం: కలెక్టర్**



పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ...' అత్యధికంగా గిరిజన మండలాలతో పూర్తిగా వెనుకబడిన మా జిల్లాలో టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించాం. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఒకేషనల్ జూనియర్ కాలేజీల్లో కూడా మంచి ఫలితాలు వచ్చాయి. ఇందుకోసం కృషి చేసిన ఉపాధ్యాయ బృందాలకు అభినందనలు. మా ప్రాంతంలో సగం గిరిజన మండలాలు ఉన్నాయి. ఎక్కువ మంది ప్రభుత్వ స్కూళ్లలోనే చదువుతారు. లక్షలాది మంది విద్యార్థుల్లో 40 శాతం సంక్షేమ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేకమైన తర్ఫీదు ఇచ్చాం. ఆడపిల్లలు ఎనిమియాతో బాధపడుతున్నారు. వారికి భవిత కార్డు అందించాం. మెటా పీటీఎం సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించాం.' అని తెలిపారు.

**అభివృద్ధిలో వెనుకబడ్డా... విద్యలో ముందున్నాం..**



పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ . 'పార్వతీపురం జిల్లా ఒడిశాకు ముఖ ద్వారం. తెలుగు, ఒరియా సంస్కృతులు ఇక్కడ ఉంటాయి. అభివృద్ధిలో మేం వెనుకబడ్డాం. కానీ చదువులో వెనుకబడలేదు. టెన్త్‌లో గత మూడు సంవత్సరాలుగా అభివృద్ధి చెందిన జిల్లాలను వెనక్కి నెట్టి ముందువరుసలో నిలిచాం. ఇక్కడ ఎక్కువ మంది ప్రభుత్వ స్కూళ్లు, కళాశాలల్లోనే చదువుతున్నారు. ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటున్నా జిల్లా మాది. ఐఐటీలో ఆ ప్రాంత విద్యార్థికి 15వ ర్యాంకు వచ్చింది. మంత్రి లోకేశ్ పర్యటనతో మాకు స్ఫూర్తినిచ్చారు. మీ అడుగు మా జిల్లా భవిష్యత్, జీవితాలను మార్చుతుందని నమ్ముతున్నాం. గతంలో టీడీపీ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ గురుకులాలను ఏర్పాటు చేసింది. రాబోయే రోజుల్లో మీ నేతృత్వంలో ప్రభుత్వ స్కూళ్లలో సీట్ల కోసం ప్రజా ప్రతినిధులు సిఫారసు చేసే స్థాయికి ఎదగాలని ఆశిస్తున్నా.' అని తెలిపారు.

## సంస్కరణలతో విద్యారంగం బలోపేతం

(ఐదో పేజీ తరువాయి)

తదితర వాటిని ప్రజలకు తెలియజేయవాలి. వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ' అని తెలిపారు.

● గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ..' అరకు పార్లమెంట్ అధ్యక్షులుగా ఉన్నప్పుడు పార్వతీపురంలో పార్టీ కార్యాలయాన్ని కూడా ప్రారంభించలేని పరిస్థితి ఉండేది. వైసీపీ సర్కారు ఎన్నో అక్రమ కేసులు పెట్టి.. దౌర్జన్యాలకు తెగబడింది. అందుకే ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పారు. మంత్రిగా నేడు ఈ స్థానంలో ఉన్నానంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీవెనలే కారణం.' అని తెలిపారు.

ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ.. నాది టీడీపీ కుటుంబం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలిచా. తెలుగుదేశం నాయకుడిగా ఉండడం నా అదృష్టం. నియోజకవర్గంలోని ప్రతి టీడీపీ కుటుంబంలో నేను సభ్యుడిగా ఉంటా.' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ తోయకజగదీశ్వరి, ఉత్తరాంధ్ర పార్టీ సమన్వయకర్త దామచర్ల సత్య, జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్, జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విజన్ ప్రణాళిక రూపొందించాలి

బొబ్బిలి రూరల్ , జూన్9 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి పరిస్థితులు, అవసరాలను పరిగణనలోకి తీసుకొని నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను ప్రతిబించేలా విజన్-2047 ప్రణాళిక రూపొందించాలని అధికారులకు బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు సూచించారు. సోమవారం బొబ్బిలిలో స్వర్ణాంధ్ర-2047 నియోజకవర్గం విజన్ యాక్షన్‌ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి, వారి భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.